భారతీయ జనతా పార్టీ - తెలంగాణ
**BHARATIYA JANATA PARTY**
**Telangana**
www.bjptelangana.org

Dr. Shyamaprasad Mukherjee Bhavan
Opp: Exhibition Grounds
Nampally, Hyderabad -500 001.
☏:040-24653311, 24653535
Fax: 040-24653929
e mail:**bjptgonline@gmail.com**

తేది: 25.09.2018

# పత్రికా ప్రకటన

బిజెపి సిద్ధాంతాలకు మూలకర్త ఏకాత్మ, మానవతావాదం, అంత్యోదయ సిద్ధాంతాన్ని ప్రవచించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 102వ జయంతి ఉత్సవాలు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మన్ దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు, మాజీ కేంద్ర మంత్రి శ్రీ బండారు దత్తాత్రేయ, శ్రీ జి. కిషన్ రెడ్డి, శ్రీ చింతల రామచంద్రారెడ్డి, శ్రీ అమర్ సింగ్ తిలావత్, శ్రీ బద్దం బాల్ రెడ్డి, శ్రీ సంకినేని వెంకటేశ్వరరావు, శ్రీ చింతా సాంబమూర్తి, శ్రీమతి జాజుల గౌరి, శ్రీ ఎన్.వి.సుభాష్, శ్రీ వేములఅశోక్, శ్రీ బిక్కునాథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కె.లక్ష్మన్ మాట్లాడుతూ.. పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. దీన్‌దయాళ్‌జీ ప్రవచించిన అంత్యోదయ సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని శ్రీ నరేంద్రమోదీ గారి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి స్వాతంత్రం, అభివృద్ధి-సంక్షేమ ఫలాలు అందాలన్న సంకల్పంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పండిట్ దీన్ దయాళ్‌జీ జీవితం సంఘం, జనసంఘంతో ముడిపడి ఉందని, సిద్ధాంత వ్యాప్తి కోసం భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి విలువలతో కూడిన రాజకీయాలను నేర్పడానికి, నడపడానికి ఎన్నికలలో పోటీ చేస్తున్నామన్నారు. ప్రజలు అవకాశమిస్తే సేవ చేస్తామని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామన్నారు. కుల, మతాలకు ముడి పెట్టకుండా రాజకీయాలు చేయాలని దీన్‌దయాళ్‌జీ కోరుకున్నారన్నారు. గెలుపు కోసం అడ్డదారులు తొక్కడం మంచి సంప్రదాయం కాదని చెప్పారన్నారు. పార్టీ కోసం, కార్యకర్తల కోసం, ప్రజల కోసం తన జీవితాన్ని అంకితమిచ్చారని అన్నారు. దీన్‌దయాళ్‌జీ రెండు జతల బట్టలతో అతి సాధారణ జీవితాన్ని గడిపారని అన్నారు. దేశం కోసం, సమగ్రత కోసం, సమైక్యత కోసం పాటుపడిన దీన్‌దయాళ్‌జీ మొఘల్ సరాయి రైల్వే స్టేషన్లో అనుమానాస్పదంగా మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి స్ఫూర్తితో విలువలతో కూడిన రాజకీయాలను నడుపుతూ, పేదల సంక్షేమమే ధ్యేయంగా శ్రీ నరేంద్ర మోదీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాలకోసం, రైతుల కోసం, మహిళల కోసం, యువతకోసం, అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తీసుకుందని, పేదల ప్రభుత్వంగా గుర్తింపు పొందిందన్నారు. ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా సిద్ధాంతాలను వదిలిపెట్టి దిగజారుడు రాజకీయాలను చేస్తున్న పార్టీలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రంగులు మార్చే ఊసరవెల్లి సైతం సిగ్గుతో తలదించుకునేలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలో కొనసాగడం, అధికారంలో పాల్పంచుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని స్పష్టం చేశారు.

పేదల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని దేశంలో 50 కోట్ల ప్రజలకు మేలుచేకూర్చే ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యభీమా పథకాన్ని తీసుకొస్తున్నారని, అయితే రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలతో ముడిపెట్టి ఈ రూ.5 లక్షల బీమా పథకాన్ని అమలు చేయమంటుదని మండిపడ్డారు. ఇది అమలు చేస్తే తమకు పుట్టగతులుండవని భావించడం దుర్మార్గం అని అన్నారు. ఈ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం కాకపోవడం పట్ల టీఆర్ఎస్ ప్రభుత్వానికి పేద ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. పేదల కోసం, వారి ఆరోగ్య భద్రత కోసం తీసుకొచ్చిన ఈ పథకాన్ని అమలు చేయకపోవడం పేద ప్రజలను వంచించడమే అవుతుందని శ్రీ అమిత్ షా ట్వీట్ చేస్తే ముఖ్యమంత్రి తనయుడు ఈ పథకం మాకు అవసరం లేదని మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగారుస్తున్న విషయం అందరికీ తెలుసనీ, ప్రైవేట్ ఆసుపత్రులలో ఈ పథకంలో రోగులను చేర్చుకోవడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించక పేదల ఆరోగ్య భద్రతను గాలికి వదిలి వేస్తుందని విమర్శించారు. ధనిక రాష్ట్రం, నిధుల కొరత లేదంటూ పేదల ఆరోగ్యం కోసం ప్రవేశపెడుతున్న పథకానికి నిధుల కొరత చూపిస్తుందన్నారు. పేదల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఇంటింటికీ, గడపగడపకూ తెలియజేస్తామన్నారు. ప్రజల ముందు ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడుతామన్నారు. రాజకీయ కోణంలో ఆలోచించే కేసీఆర్ ప్రభుత్వం పేద ప్రజల నోటికాడి కూడును కొట్టేసిన వైనాన్ని ప్రజలకు తెలియజెప్తాం అన్నారు.

భారతీయ జనతా పార్టీ - తెలంగాణ
BHARATIYA JANATA PARTY
Telangana
www.bjptelangana.org

Dr. Shyamaprasad Mukherjee Bhavan
Opp: Exhibition Grounds
Nampally, Hyderabad -500 001.
✆:040-24653311, 24653535
Fax: 040-24653929
e mail:**bjptgonline@gmail.com**



శ్రీ నరేంద్రమోదీ గారి ప్రభుత్వం పేద ప్రజలకు భాగస్వామ్యం చేయడానికి, వారిని అభివృద్ధిలోకి తీసుకురావడానికి, అనేక కార్యక్రమాలను తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం వాటిని అడ్డుకుంటుందన్నారు. ప్రధానమంత్రి అవాస్ యోజన కింద దాదాపు రెండు లక్షల అరవై వేల పైగా ఇండ్లను మంజూరు చేస్తే వాటిని వారికి ఇవ్వకుండా అడ్డుకుందన్నారు. శ్రీ నరేంద్రమోదీ గారు ప్రతి పేద వారికి సొంతింటి కలను నిజం చేయాలన్న లక్ష్యంతో కోటి ఇల్లు కట్టించి ఇవ్వాలని పని చేస్తున్నారన్నారు. ఎక్కడో కట్టిన రెండు పడక గదుల ఇల్లును చూపించి పేద ప్రజలను మోసం చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర నిధులను మళ్లించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించకుండా బుట్ట దాఖలు చేసిందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సరిగ్గా అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడమే కాకుండా రైతులను అన్యాయం చేసిందన్నారు. కుట్రపూరితంగా కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పేద ప్రజలను కేంద్ర పథకాలలో భాగస్వామ్యం చేయకపోవడాన్ని తప్పుపట్టారు.

కాంగ్రెస్ చేస్తున్న నాటకాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్తామన్నారు. అవినీతి కుంభకోణాలు, బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలకు పెట్టింది పేరు కాంగ్రెస్ అనీ.. టీఆర్ఎస్‌కు, కాంగ్రెస్ తేడా లేదన్నారు. మహా కూటమిని విష కూటమి, విఫల కూటమి, విచిత్రమైన కూటమిగా ప్రజలు భావిస్తున్నారని... తెలంగాణవాదం వినిపించే కోదండరాం లాంటి వాళ్ళు అవకాశవాద కాంగ్రెస్, టిడిపిలో జత కలవడం సరైంది కాదని అన్నారు. టీఆర్ఎస్ అవకాశవాద, ఫిరాయింపులకు వ్యతిరేకంగా, కాంగ్రెస్ అవినీతి, కుంభకోణాలకు వ్యతిరేకంగా విలువలతో కూడిన రాజకీయాలకు వేదికగా బిజెపిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసినా... టిడిపి పార్టీకి ఓటేసినా.. టీఆర్ఎస్ పార్టీకి ఓటేసినా... మజ్లిస్ పార్టీకి వేసినట్లుగానే భావించుకోవాల్సిన అవసరముందన్నారు. బిజెపి పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలకనుగుణంగా, వారు కోరుకున్న అంత్యోదయ సిద్ధాంతంతో పనిచేయడానికి బిజెపికి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, మోదీ విజయాలను వివరించాలని కార్యకర్తలకు సూచించారు.

శ్రీ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ... పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అత్యంత పేద కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులు అభ్యసించిన మహనీయులని అన్నారు. పేదల్లో నిరుపేదలకు ప్రభుత్వ ఫలాలు అందాలని ఆశించిన వ్యక్తిగా అభివర్ణించారు. కమ్యూనిజం, కాపిటలిజం రెండూ దేశంలో ఉన్న సమస్యలకు సరిపోవని, పరిష్కారం కావని... భారతీయ ఆలోచనల్లోని భారతీయతత్వంతోనే అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. పండిట్ జీ ఏకాత్మతా మానవతావాదం సిద్ధాంతాన్ని ప్రవచించారని, జాతీయ వాదం చాలా ముఖ్యమని భావించారని మన వనరులు, మన శక్తితో మన దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరుకున్నారని తెలిపారు. విలువైన ఖనిజ సంపదను, బొగ్గును, అడవులను కాంగ్రెస్ దోచుకుందని, మానవ వనరులను, జాతి సంపదను దేశం కోసం సద్వినియోగం చేసుకోవాలని కోరుకున్నారని తెలిపారు. రాజకీయాలను వ్యాపార దృష్టితో కాకుండా దేశ హితం కోసం ఉండాలని చెప్పారని అన్నారు. శ్రీ నరేంద్రమోదీ గారి ప్రభుత్వం పండిట్ దీన్ దయాళ్ అంత్యోదయ స్ఫూర్తితో రైతు కూలీలకు నేరుగా వేతనాలు అందుతున్నాయన్నారు. సమాఖ్య స్ఫూర్తికి శ్రీ నరేంద్రమోదీ గారు పనిచేస్తూ టీమిండియా, 'సబ్ కా సాత్- సబ్ కా వికాస్' నినాదంతో పనిచేస్తున్నారన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం సంక్షేమం, అభివృద్ధి కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

**కార్యాలయ కార్యదర్శి**